క్లుప్తంగా

ఆహ్వాన పత్రిక విడుదల



గద్దెరాళ్ల మారెమ్మ జాతర పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: దేవనకొండ మండలం గద్దెరాళ్ల గ్రామంలో వెలసిన మారెమ్మ అవ్వ జాతర ఆహ్వాన పోస్టర్లను మంగళవారం ఆలూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా దేవదాయ శాఖ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి విడుదల చేయించారు. ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే మారెమ్మ జాతర ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

వైభవంగా లంకోత్సవం



హనుమంతుడిపై శ్రీరంగనాథుడు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం లంకోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి హనుమంతుడిపై కొలువుంచి గ్రామ పుర వీధుల గుండా జనవాహని మధ్య ఊరేగింపు చేశారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, దాతలు పారా రామ చంద్రప్రసాద్,విశ్వనాథ్, భక్తులు పాల్గొన్నారు.

రస్తా విషయంపై రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

హొళగుంద: స్థానిక ఎస్సీ కాలనీలో రస్తా విషయంపై ఎమ్మార్పీఎస్ నాయకులు, కాలనీవాసులు మంగళవారం ఆందోళనకు దిగారు. కాలనీలో తలారి నర్సమ్మ, కుటుంబసభ్యులు రస్తాను ఆక్రమించుకుని ముళ్లకంపలు వేశారని, వెంటనే తొలగించాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు పంచగుండిగ వెంకటేష్, మంగయ్యతో పలువురు స్థానికులు స్థానిక ఎయిర్‌టెల్ టవర్ సమీపంలో ఆదోని రోడ్డుపై బైఠాయించారు. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. హెడ్ కానిస్టేబుళ్లు గిరీశ వరప్రసాద్, తిరుపాల్‌నాయక్, సిబ్బంది అక్కడికెళ్లి ఆందోళనకారులతో చర్చించారు. వివాదం పరిష్కారమయ్యే వరకు దారి వదలాలని తలారి కుటుంబ సభ్యులను కోరగా ఇది పట్టా స్థలమని, రస్తా లేకపోయినా ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొంటూ కంచె తీసేందుకు నిరాకరించారు. రికార్డులు పరిశీలించి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఆర్ఐ దినోజ్, పోలీసులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. సాయంత్రం అక్కడికి చేరుకున్న ఎస్ఐ అబ్దుల్‌జహీర్ ఇరువర్గాలకు నచ్చజెప్పి కంచెను తొలగించడంతో పాటు రాస్తారోకో విరమింపజేశారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి

నందవరం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎంపీటీసీలు నంబర్లతో అభ్యర్థులకు ఓటును ఈ నెల 13వ తేదీన ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వేయాలన్నారు. ఓటర్ స్లిప్‌తో పాటు ఆధార్ లేదా, ఓటర్ ఐడీ, ఎంపీటీసీ ఐడీ కార్డు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేశారు. ఏపీఓ మాలిక్ బాషా, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బియ్యం తరలింపుపై విచారణ



రైస్‌మిల్‌లో గుర్తించిన నూకలపై విచారిస్తున్న విజిలెన్స్, రెవెన్యూ అధికారులు

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని ఉరుకుంద రైస్ మిల్ వద్ద మంగళవారం ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 15 బస్తాల బియ్యాన్ని (దాదాపు 9 క్వింటాళ్లు) డోన్ విజిలెన్స్ తహసీల్దార్ వెంకటనారాయణ, ఎస్ఐ జయన్నలు పట్టుకున్నారు. చెరుకులపాడుకు చెందిన ఆటోను సీజ్ చేసి ఓనర్ వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆటోలోని బియ్యాన్ని సమీప ఉరుకుంద రైస్‌మిల్‌కు తరలిస్తున్నట్లు తెలుసుకుని రైస్‌మిల్లులో సోదాలు నిర్వహించారు. మిల్లులో 80 బస్తాల నూకలు ఉన్నట్లు గుర్తించారు. అక్కడకు చేరుకున్న వెల్దుర్తి తహసీల్దార్ రాజేశ్వరి మాట్లాడుతూ నూకలు రేషన్ బియ్యానికి సంబంధించినవేనా అని విచారిస్తున్నట్లు తెలిపారు. రైస్‌మిల్ ఓనర్ చింతలయ్య, ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేయాల్సిందిగా స్థానిక పోలీసులను కోరినట్లు విజిలెన్స్ అధికారులు చెప్పారు. బియ్యానికి సంబంధించిన పంచనామా నిర్వహించి పూర్తి వివరాలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు రెవిన్యూ అధికారులు వెల్లడించారు.

ఆమెకు సాటెవ్వరు

● ఆత్మవిశ్వాసమే 'ఆమె'కు ఆభరణం

మహిళా దినోత్సవం

మారుతున్న కాలానికి అనుగుణంగా మగువల మనోధైర్యం రాటుదేలుతోంది. పురుషులకు సమానంగా విభిన్న రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు. ఓ వైపు గృహిణిగా ఇంటి పనులు, కుటుంబసభ్యుల అవసరాలన్నీ చక్కబెడుతూ మరోవైపు అవకాశాలను అందిపుచ్చుకొని అందరికీ ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సొంత కష్టంతో ఆర్థిక-సామాజిక స్వావలంబన సాధిస్తున్నారు. ఆత్మవిశ్వాసమే వారికి ఆభరణమై వన్నె (వృద్ధి) తెస్తోంది. నేడు ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

చదువుల 'అంబిక'



అంబికాజైన్, సివిల్స్ విజేత

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరుకు చెందిన ఎల్.అంబికా జైన్ గతేడాది సివిల్స్‌లో 128వ ర్యాంక్ సాధించి సత్తా చాటింది. వ్యాపారం కోసం వలసొచ్చిన కుటుంబం, ఆచారాలు-కట్టుబాట్లకు ప్రాధాన్యతనిచ్చే నేపథ్యం నుంచి సివిల్స్ విజేతగా నిలిచింది. పట్టణానికి చెందిన జైన్ ఎలక్ట్రికల్ షాపు యజమాని లలిత్‌కుమార్, అనిత దంపతుల కూతురు అంబికాజైన్ 10వ తరగతి వరకు ఎమ్మిగనూరు గుడ్‌షెప్పర్డ్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసింది. ఇంటర్, డిగ్రీలను హైదరాబాద్ శ్రీ చైతన్య ఐఏఎస్ అకాడమీలో పూర్తి చేసింది. ఢిల్లీ సౌత్ ఏషియన్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ రిలేషన్‌షిప్‌లో ఎంఏ చేసింది. ఐపీఎస్‌గా ఎంపికై శిక్షణ తీసుకొంది. అయినా ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో సెలవుపెట్టి ఈ యేడాది మళ్లీ సివిల్స్‌కు ప్రిపేరయ్యింది. మెయిన్స్ పాస్ అయ్యింది. ఈమెకు ఏప్రిల్ 10న ఇంటర్వ్యూ ఉంది. కలెక్టర్ కావాలనే లక్ష్యంతో శ్రమిస్తున్నా, ఇంటర్వ్యూ ఫలితాలను బట్టి తదుపరి కార్యాచరణ చేపడుతానని అంబికాజైన్ వెల్లడించింది. ప్రతిభకు లింగ భేదం అడ్డంకి కాదని, మగువలు ప్రయత్నిస్తే సమున్నత శిఖరాలు సాధ్యమేనని భావితరాలకు భరోసా ఇస్తోంది.

గ్రామ జ్యోతి

ఆలూరు: జిల్లాలో ఆ గ్రామం పేరు వింటేనే అందరికీ హడల్. మొదటగా గుర్తుకొచ్చేది ఫ్యాక్షన్. ఒకప్పుడు రక్తపు మడుగులు, మరకలతో నిండింది దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల గ్రామం. ప్రస్తుతం గ్రామంలో శాంతి కుసుమాలు కన్పిస్తున్నాయి. ఆనాటి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తానా సంస్థ నిర్వాహకురాలు గ్రామజ్యోతి సహకారంతో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా మహిళలను పొదుపు సంఘాలుగా ఏర్పరచి రుణాలు మంజూరు చేయించారు. వివిధ చేతివృత్తులపై వారికి శిక్షణ ఇవ్వడంతో నేడు అనేక మంది చిరు వ్యాపారాలు పెట్టుకుని జీవితం కొనసాగిస్తున్నారు. బర్రెలు, గొర్రెలు, మేకలు, పాడి పశువుల పెంపకం, కుట్టు మిషన్లు, పిండి మిషన్, కారం పొడి, ఇస్తరాకుల తయారీ, సర్ఫ్ తయారీ ఇలా అనేక రకాలుగా రాణిస్తూ స్ఫూర్తిగా సాగుతున్నారు.

సర్ఫ్ విక్రయం పెరిగింది



అంజలీదేవి సర్ఫ్ తయారీదారురాలు

మాది సాధారణ కుటుంబం. కూలీకి వెళ్లి తినే పూట గడిచేది. 2016 నుంచి గ్రామాన్ని జిల్లా మాజీ ఎస్పీ ఆకె రవికృష్ణ దత్తత తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం. ఆనాటి నుంచి నేటి వరకు గ్రామంలో అందరు మహిళలు పలు రంగాల్లో శిక్షణ పొంది ఆర్థికంగా నిలదొక్కుఉన్నారు. స్వయం శక్తితోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. నేను ముడిసరుకు తెచ్చుకుని బ్రాండెడ్ సర్ఫ్ తయారుచేసి విక్రయిస్తున్నా. వచ్చిన ఆదాయంతో కొంత బ్యాంకు రుణం చెల్లించగా కుటుంబ ఖర్చులకు కొంత మిగులుతుంది.

– అంజలీదేవి, కప్పట్రాళ్ల గ్రామ జ్యోతి పొదుపు గ్రూపు మహిళ

గతంలో ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యాం

మాది నిరుపేద కుటుంబం. తగిన ఆదాయం ఉండేది కాదు. ఎలాగైనా కుటుంబానికి అండగా నిలవాలని అనుకునేదాన్ని. పొదుపు సంఘంలో చేరడంతో దశ తిరిగిపోయింది. బ్యాంకు రుణం, ప్రభుత్వ ప్రోత్సాహం, గ్రామ జ్యోతి సహకారంతో చీరల దుకాణం ప్రారంభించా. మొదట్లో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాం. వ్యాపారం క్రమంగా పుంజుకుంది. ప్రస్తుతం వ్యాపారం మెరుగ్గా జరగడంతో ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి. చాల ఆనందంగా ఉంది.



– ఫకుర్‌బీ, పొదుపు మహిళ, కప్పట్రాళ్ల

విశాలాక్షి పంక్చర్ షాప్

పత్తికొండ: వాహనాల ట్యూబ్‌లకు పంక్చర్ వేయడం మగవాళ్లు మాత్రమే చేస్తుంటారు. కఠిన శ్రమతో కూడిన పని కదా మనతో ఏమవుతుందిలే అనుకోకుండా పత్తికొండకు చెందిన విశాలాక్షి పంక్చర్ షాపు నిర్వహిస్తోంది. స్కూటర్, ఆటో, టైరు బండ్లకు పంక్చర్ వేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో జీవనాధారం కోసం చిన్నబంకు పెట్టుకున్నారు. అక్కడే భర్త టీస్టాల్ నిర్వహిస్తుండగా, విశాలాక్షి పంక్చర్ షాపు పని చేస్తుంది. బ్రహ్మయ్యాచారి, విశాలాక్షి దంపతులకు నర్మద, సాయి ప్రసన్న, పావని ముగ్గురు కుమార్తెలు. పెద్దకుమార్తెకు పెళ్లి చేశారు. రెండో కుమార్తె ఇంటి చేదోడుగా ఉండగా చిన్నకుమార్తె పావని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతోంది. తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూసి పావని కూడా పంక్చర్ వేయడం, టైరుకు గాలి పట్టడం నేర్చుకుంది. తల్లి ఇంటి పనుల్లో ఉన్న సమయంలో పావని కూడా పంక్చర్ వేస్తుంది.



పత్తికొండలో బైక్‌కు పంక్చర్ వేస్తున్న విశాలాక్షి, సహాయకురాలిగా కుమార్తె పావని

కదిలించిన పాట



దాసరి పార్వతి, గాయని, లక్కసాగరం

మారుమూల గ్రామంలో పుట్టి పెరిగి తన స్వరంతో న్యాయ నిర్ణేతలను మెప్పించి,వారు ఏమి కావాలని అడగ్గా తమగ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకున్న లక్కసాగరం దాసరి పార్వతి స్వార్థం లేని గాయనిగా అందరి మనసులు చూరగొంది. జీ తెలుగు చానల్‌లో పాడిన 'ఊరంత వెన్నెల.. మనసంతా చీకటి' పాటకు ప్రభుత్వం స్పందించి ఆ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించింది. సంగీతంపై ఉన్న మక్కువను గుర్తించి మా అన్నయ్యలు తమ కష్టాన్ని దారపోసి నన్ను చదివించారు. ఒక్కోసారి తిరుపతి వెళ్లడానికి డబ్బులు లేని సమయంలో మా అక్క సరస్వతి నన్ను వెన్ను తట్టి ప్రోత్సహించింది. నా జీవన గమ్యంలో నా కుటుంబసభ్యులెవ్వరు నాకు అడ్డు చెప్పలేదు. వారి సహకారంతోనే నేడు ఈ స్థితికి చేరుకున్నా. భవిష్యత్తులో మంచి గాయనిగా స్థిరపడి కుటుంబానికి చేదోడుగా ఉంటా. అలాగే జిల్లాలో ఎక్కడో ఒక చోట సంగీత పాఠశాల ఏర్పాటు చేసి ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇవ్వాలన్నదే నా ఆశయం అని పార్వతి పేర్కొంది.

ఆమె.. ఆటో

అది మారుమూల గ్రామం.. నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ. కూలీ పనికి పోతే వచ్చే డబ్బులు కుటుంబానికి సరిపోవు. కుటుంబానికి అండగా నిలవాలన్న తపనతో బతుకు పోరాటంలో దిగింది తుగ్గలి మండల పరిధిలోని రోళ్లపాడుకు చెందిన రీధికమ్మ. ఇన్నాళ్లు వంటింట్లో గరిట పట్టిన చేతులతో ఆటో స్టీరింగ్ పట్టింది. డ్రైవింగ్ నేర్చుకుని రోడ్డుపై రయ్..రయ్ మంటూ ప్రయాణికులతో దూసుకెళుతోంది. భర్త రాజు సెంట్రింగ్ పని చేస్తుండగా ఆటో నడపగా వచ్చే ఆదాయంతో కుటుంబానికి అండగా నిలుస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు. ఆర్డీటీ సహకారంతో రెండు నెలల క్రితం డ్రైవింగ్ నేర్చుకోవడంతో 20 రోజుల క్రితం ఆ సంస్థ ఆటో ఇచ్చింది. డ్రైవరక్క ప్రయాణికులను ఎక్కించుకుని ప్యాపిలి, గుత్తి తదితర ప్రాంతాలకు వెళుతోంది. ఈమెను చూసి పలువురు శభాష్ అంటూ అందరూ అభినందిస్తున్నారు.



ఆటో నడుపుతున్న రీధికమ్మ

గోల్డ్ మైనింగ్ పనుల అడ్డగింత

తుగ్గలి: లీజు డబ్బులు సకాలంలో ఇవ్వకపోగా ఉపాధి చూపడం లేదని భూములు కోల్పోయిన రైతులు గోల్డ్ మైనింగ్ కంపెనీ పనులను అడ్డుకున్నారు. మంగళవారం బొల్లవానిపల్లి, పగిడిరాయికి చెందిన పలువురు రైతులు మైనింగ్ ప్రదేశానికి వెళ్లి పనులు నిలిపివేశారు. ముందుగా చేసుకున్న ఒప్పందం మేరకు ఎకరాకు రూ.12 లక్షలు ఇవ్వాలని, ప్రస్తుతం రూ.10 లక్షలు ఇచ్చి ఇంకా రూ.2 లక్షలు ఇంత వరకు ఇవ్వలేదన్నారు. అదిగో ఇదిగో అంటూ మభ్యపెడుతున్నారని వాగ్వివాదానికి దిగారు. లీజు కూడా పెంచుతామని చెప్పి ఇంతవరకు పెంచలేదన్నారు. భూములు కోల్పోయిన రైతు కుటుంబాల వారికి కంపెనీలో ఉపాధి చూపుతామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారికిచ్చిన హామీలన్నీ నెరవేర్చేవరకు పనులు జరగనివ్వబోమని తేల్చి చెప్పారు. తమ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని సైట్ సూపర్‌వైజర్ హరికిరణ్ హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు.

కడుపుబ్బ నవ్వించిన కామన్న వేడుకలు



కామన్న వేడుకల్లో భాగంగా ఊరేగింపు



హాస్య నాటకం ప్రదర్శిస్తున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కామన్న వేడుకలు వైభవంగా జరిగాయి. గ్రామంలోని విరక్త మఠం పరిసర ప్రాంతానికి చెందిన యువకులు, పెద్దల సహకారంతో ఈ వేడుకలను వారం క్రితం ప్రారంభించారు. హోలీ పున్నమిని పురస్కరించుకుని ప్రారంభించిన ఈ వేడుకల్లో తొమ్మిది రోజులపాటు అనేక రకాల హాస్య సన్నివేశాలను ప్రదర్శించి ప్రజలను కడుపుబ్బ నవ్వించారు. పాత కాలపు సాంప్రదాయాలు కాలరాసుకుపోతున్న ఈ తరుణంలో యువకులు కుట్టిదరే కుట్టమ్మ, ఇల్లిబా సంగయ్య, కూతురి కాన్పుకష్టాలు, సన్యాసులు, వరుడి అన్వేషణ, శోభనం, కామన్న భార్యల కష్టాలు, కామన్న దహనం ఇలా పలు హాస్య సన్నివేశాలను ప్రదర్శించారు. వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి మజ్జిగ బండ్లు, ఏనుగు, ఒంటెల ఊరేగింపు నిర్వహించి కామన్న దహనాన్ని చేపట్టారు. బుధవారం కామన్న శవ ఊరేగింపు, వధూవరుల ఊరేగింపు నిర్వహించి ఆనందంగా రంగులు చల్లుకుని హోలీ జరుపుకోనున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి తదితరులు

చిప్పగిరి: ఉమ్మడి కర్నూలు జిల్లా పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జ్‌గా చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షిని నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం జెడ్పీటీసీ విరుపాక్షి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని మరో సారి నిరూపణ అయ్యిందన్నారు. తనకు ఇచ్చిన అవకాశానికి సంపూర్ణ న్యాయం చేసేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. స్థానిక నాయకులు ఓ బులేసు, నాగప్ప, లోకనాథ్, తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మేజిస్ట్రేట్ గురుఅరవింద్ అభిప్రాయపడ్డారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చిన్న చిన్న విషయాలకు గొడవలు పడకుండా పెద్ద మనుషుల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్నచిన్న గొడవలకు కోర్టుల చుట్టు తిరగకుండా రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులకు సత్వర పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. న్యాయవాదులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

వెల్దుర్తి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో నవధాన్యాల సాగుపై వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం బుక్కాపురం సబ్ డివిజన్ అధికారి మాబువలి ఆధ్వర్యంలో మండల పరిధిలోని సిద్ధినగట్టు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మంగళవారం ఆయన మాస్టర్ ట్రైనర్ వెంకటేశ్వర్లు, పరమేశ్, ఐసీఆర్‌పీ రమేశ్‌లతో కలిసి గ్రామంలోని విద్యార్థులతో నవధాన్యాల సాగు – నేలతల్లి బాగు, రసాయన ఎరువులు వద్దు – ప్రకృతి వ్యవసాయం ముద్దు అన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. మాబువలి మాట్లాడుతూ ఖరీఫ్‌కు ముందు 30 రకాల నవధాన్యాలను (పచిరొట్ట, పప్పుధాన్యం, ఆకుకూరలు, కూరగాయాలు, సుగంధ ద్రవ్యాలు తదితర విత్తనాలు) ఎకరానికి 13 కేజీలు వేయాలన్నారు. సేంద్రీయ ఎరువులు, వేప నూనె తదితరాలు ఉపయోగించి నేలను సారవంతం చేసుకుని, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. గ్రామ నాయకులు ముని, లక్ష్మీ మాధవరెడ్డి, అయ్యప్పరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

ఆలూరు: స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో కలిసి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సమావేశం నిర్వహిస్తున్నట్లు మంగళవారం పార్టీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి స్థానిక సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ మధుసూదన్, వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, పట్టభద్రులు హాజరుకావాలని కోరారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎమ్మిగనూరుటౌన్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ మస్తాన్‌వలి సూచించారు. మంగళవారం రాత్రి పట్టణంలోని వీవర్స్‌కాలనీ మైదానంలో యువతను సమావేశపరిచి పలు సూచనలిచ్చారు. మైదానంలో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెట్టుబడులతో ఏపీకి బంగారు భవిష్యత్తు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: విశాఖపట్టణంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు దేశవిదేశాలకు చెందిన ప్రముఖపారిశ్రామికవేత్తలు ముందుకు రావడంతో రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు రానుందని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఒప్పందాలు చేసుకోవడంపై మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, అవకాశాలకు ఆకర్శితులై రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు 378కి పైగా కీలక ఒప్పందాలను చేసుకోవడం జరిగిందన్నారు. ఆయా పెట్టుబడులతో ఏర్పాటు చేయనున్న సంస్థల్లో దాదాపు 6 లక్షల మంది యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర ఆదాయం పెరగడంతో పాటు నిరుద్యోగ సమస్య తీరుతుందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనలో భారీగా పరిశ్రమలు రానుండడం శుభసూచకమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు రాజారత్నం, బజారి తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ప్రచారం

ఎమ్మిగనూరుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఆయన మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, వార్డు సచివాలయాల్లో పట్టభద్రులైన ఉద్యోగులను కలిసి కరపత్రాలు అందజేసి ఓట్లు అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత లక్షన్నరకు పైగా యువతకు సచివాలయ ఉద్యోగాలను కల్పించారన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్ఆర్‌సీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బుట్టారంగయ్య, యూకే వీరేంద్ర, తదితరులు వెంట ఉన్నారు.

సామూహిక మరుగుదొడ్డిని తొలగించండి

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరి ఉన్న సామూహిక మరుగుదొడ్డిని తొలగించాలని గ్రామానికి చెందిన పలువురు కోరుతున్నారు. ఈ మరుగుదొడ్డి వల్ల దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. మరుగుదొడ్డిని తొలగించాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరుగుదొడ్డిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

మద్దికెర: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ సూచించారు. బుధవారం మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాలలో జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. దశల వారీగా బిల్లులు కూడా మంజూరవుతున్నాయన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ కుమార్ వెంట ఉన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

మద్దికెర: మండల కేంద్రంలోని హోటల్ బంకులో గ్యాస్ సిలిండర్ పేలి జీవనాధారం కోల్పోయిన బాధితురాలు లక్ష్మీదేవికి పోచిమిరెడ్డి సేవాదళ్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి మంగళవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బాధితురాలిని ఆదుకునేందుకు రాజకీయాలకతీతంగా సాయం చేయాలని పిలుపునిచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానన్నారు. పంచాయతీ సభ్యుడు బాలచంద్ర, మోహన్, సురేష్, చంద్ర, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గడ్డివాములు దగ్ధం



అగ్నిప్రమాదంలో గాయపడిన ఎద్దును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: మండల పరిధిలోని రాతనలో సోమవారం అర్ధరాత్రి గడ్డి వాములు దగ్ధమయ్యాయి. వామిదొడ్లలో ఉన్న పాత గడ్డివాములకు నిప్పు అంటుకొని శాంతప్ప, ఉసేన్‌పీరా, వెంకటరాముడుతో పాటు మరో ఇద్దరి పశుగ్రాసం దగ్ధమైంది. వామిదొడ్లలో వేసిన కొట్టాలు కాలిపోయాయి. శాంతన్నకు చెందిన ఎద్దుకు గాయాలయ్యాయి. ఎవరైనా నిప్పు పెట్టారా లేక మరేదైనా ప్రమాదమా అనేది తెలియాల్సి ఉంది. దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, తహసీల్దార్ రవి ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత రైతులు శాంతప్పకు రూ.10 వేలు, వెంకటరాముడు, ఉసేన్‌పీరాలకు చెరో రూ.5 వేలు చొప్పున ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేశారు.

నాలుగు ఎద్దుల అపహరణ

తుగ్గలి: కల్లందొడ్డిలో కట్టేసిన ఎద్దులను దొంగలు అపహరించుకుపోయిన సంఘటన తుగ్గలిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పలువురు రైతులు రోడ్డు పక్కనున్న కల్లందొడ్డిలో రోజూలాగే ఎద్దులను కట్టేశారు. సోమవారం అర్ధరాత్రి రైతులు హరిశ్చంద్రకు చెందిన రెండు ఎద్దులు, సుధాకర రెడ్డి, సూర్యనారాయణరెడ్డికి చెందిన రెండు ఎద్దులను దొంగలు వాహనంలో ఎత్తుకెళ్లారు. ఉదయం వెళ్లి చూసేసరికి ఎద్దులు లేకపోవడంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. నాలుగు ఎద్దులు దాదాపు రూ.2లక్షల విలువ చేస్తాయని వారు తెలిపారు. ఏటా తుగ్గలిలో ఎద్దులు, పొట్టేళ్లు ఎత్తుకెళుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



దూదేకుల హసన్ (ఫైల్)

నందవరం: బోరు పైపు లైన్ తీస్తుండగా దూదేకుల హసన్ (48) అనే రైతు విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడ్డాడు. వివరాలు.. మండల పరిధిలోని ఇబ్రహీంపురం కొట్టాల గ్రామంలో బోరు మోటార్ మరమ్మతులకు గురైంది. వ్యవసాయ కూలీలతో కలిసి పైపులు పైకి తీస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలను తగలడంతో విద్యుదాఘాతానికి గురై రైతు కుప్పకూలిపోయాడు. అదృష్టవశాత్తు కూలీలు కాడను పట్టుకుని ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. కాసేపటికి అప్రమత్తమైన కూలీలు పైపులను వదిలేసి రైతు హసన్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య మహబూబ్ బీ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

దివ్యాంగ రైతు ఆత్మహత్య



మృతి చెందిన రాజేశ్

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎస్.పేరేములకు చెందిన దివ్యాంగ రైతు బోయ భోగ్యం రాజేశ్ (35) మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. గ్రామం నుంచి బింగిదొడ్డి వైపు కసాపురం సమీపంలో రహదారి పక్కన బీడు భూమిలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న రాజేశ్‌ను వాహనదారులు గుర్తించి వెల్దుర్తి ఆసుపత్రికి అనంతరం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిపారు. చేతి వైకల్యం కలిగిన రాజేశ్, భార్య సువర్ణ వ్యవసాయంతోపాటు కూలీలుగా జీవనం సాగించేవారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎకరా పొలం ఉంది. పంటలు సరిగా రాకపోవడం, కుటుంబ ఖర్చులు, వ్యవసాయానికి చేసిన దాదాపు రూ.4 లక్షల వరకు కావడంతో అప్పులు తీర్చే మార్గం లేక వేదన పడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన సాయి

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కాల్వబుగ్గ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. మండలంలోని లింగాలపల్లెకు చెందిన సాయి, కృష్ణారెడ్డి బైక్‌పై రామళ్లకోట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కర్ణాటకకు చెందిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో సాయి కాలికి తీవ్రగాయాలు కాగా, కృష్ణారెడ్డి స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.